సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

స్మార్ట్ బాదుడు

- స్మార్ట్ మీటర్లు అమరికతో వ్యాపారస్తులు గగ్గోలు
- చిరు వ్యాపారుల పరిస్థితి దారుణం
- పెరుగుతున్న విద్యుత్ భారాలు
- ఆందోళనలో వినియోగదారులు

రాయచోటిలో ఓ దుకాణానికి జూన్‌లో రూ.4,509 వచ్చింది. జులైలో రూ..17,274 బిల్లు వచ్చింది

ప్రజాశక్తి-రాయచోటి

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో భారాల మోత మోగుతోంది. చిరు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. గతంలో వచ్చే బిల్లు కంటే 30 నుంచి 40 శాతం బిల్లులు అధికంగా వస్తుండడంతో గగ్గోలు పెడుతున్నారు. కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. బిల్లులు పెరిగి జనం గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా బిగిస్తున్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను వేగవంతంగా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 9,431 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా ఇప్పటి వరకూ 8,639 కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను అమర్చారు. 53,084 మంది వినియోగదారులు (కమర్షియల్) ఉన్నారు. 29,534 మంది గృహ వినియోగదారుల ఉండగా 13,86 మందికి స్మార్ట్ మీటర్లు బిగించారు. గృహ వినియోగదారుల్లో 800 యూనిట్ల పైబడిన వారికి మాత్రమే స్మార్ట్ మీటర్లు తొలుత బిగించారు. ప్రస్తుతం 200 యూనిట్లు పైపడితే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించన వారికి విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో వినియోగదారులు గొగ్గోలు పెడుతున్నారు. పేద, మధ్య తరగతి, ధనిక, వ్యాపారస్తులు అనే తేడా లేకుండా అందరిపైనా స్మార్ట్ మీటర్లు పేరుతో విద్యుత్ భారాలు భారం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా వాణిజ్య వినియోగదారులు (కమర్షియల్) దాదాపు లక్ష మంది, గృహ వినియోగదారులు (డొమెస్టిక్), 5,89,988 మంది ఉన్నారు.

చాపకింద నీరులా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు : స్మార్ట్ మీటర్లు బిగింపు జిల్లా వ్యాప్తంగా చాప కింద నీరులా విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మొదట ప్రభుత్వ కార్యాలయాలు వ్యాపార సంస్థలకే బిగిస్తూ ప్రస్తుతం గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లను బిగించడం మొదలు పెట్టారు. స్మార్ట్ మీటర్లపై కూటమి ప్రభుత్వం మౌనంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉంది. గత వైసిపి ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను కూటమి వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

సామాన్యులకు తప్పని కష్టాలు : స్మార్ట్ మీటర్లు బిగించడంతో పట్టణంలోని ఒక దుకాణానికి గతంలో రూ.4,509 వచ్చేది. ప్రస్తుతం రూ.17,274 వచ్చింది. రామాపురం మండలానికి చెందిన ఒక కుటుంబం రాయచోటిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇంటికి తాళాలు వేసినా కూడా గతంలో రూ.200 నుంచి రూ.300 వరకు వచ్చేది. ప్రస్తుతం రూ.600 పైబడి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసరకులు, వంట నూనెలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోయాయి. ఇప్పుడు విద్యుత్ బిల్లులు కూడా అధికంగా వస్తే ఎలా జీవించాలని సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శీతాకాలంలోని విద్యుత్ బిల్లు ఎలా ఉంటే రాబోయే వేసవికాలంలో విద్యుత్ బిళ్ళులు ఏ విధంగా వస్తాయని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆలోచించి స్మార్ట్ మీటర్లు బిగించ వద్దని స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

గతంలో విద్యుత్ బిల్లులు రూ.3 వందలు వచ్చేది. ప్రస్తుతం రూ.6 వందలు పైబడి విద్యుత్ బిల్లు వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్మార్ట్ మీటర్ల బిగించ వద్దు.ఇప్పటికే వ్యవసాయ కూలీలు పెరిగిపోయాయి. నాలుగు సంవత్సరాలుగా వర్షాలు కూడా సక్రమంగా కురవ పోవడంతో పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రావడం లేదు. స్మార్ట్ మీటర్ల ఆలోచన విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

- రెడ్డయ్య, రైతు, రాయచోటి.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

జగన్ ప్రారంభించిన స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలి. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష పార్టీలు సమరశీల పోరాటం చేయడంతో మమతా బెనర్జీ ప్రభుత్వం బిగించకుండా వెనక్కి తగ్గింది. ప్రక్క రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణలో స్మార్ట్ మీటర్లను బిగించలేదు. విద్యుత్ భారాల దెబ్బకు విజయనగరం, విశాఖపట్నంలో ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు మూతపడ్డాయని, గార్మెంట్ ఫ్యాక్టరీలు సంక్షోభంలో ఉన్నాయి. ఉన్న స్వదేశీ పరిశ్రమలను మూతవేయిస్తూ, విదేశీ కంపెనీలు ద్వారా ఉపాధి పెంచుతామని ప్రభుత్వం ప్రగ ల్భాలు పలుకు తోంది. స్మార్ట్ మీటర్లపై అదానికి టిడిపి లంగిపోయింది. అధికారంలోకి వస్తే ఛార్జీలను పెంచ బోమని చెప్పి రూ.15 వేల కోట్లు భారం ప్రజలపై టిడిపి మోపింది.

-పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్, రాయచోటి

అపోహలు వద్దు

సెల్ ఫోన్‌లో యాప్ డైన్‌లోడ్ చేసుకొని బిల్లులు చెల్లించుకోవచ్చు. ఒకవేళ బిల్లులు ఎక్కువగా వస్తే ఇంట్లో ఏ వస్తువు వాడడం వలన అధిక బిల్లు వస్తుందో వెంటనే తెలుసుకోవచ్చు. దాని వాడుకను తగ్గించుకొని విద్యుత్ బిల్లులను అధికంగా రాకుండా వినియోగదారులు చూసుకోవచ్చు. 200 యూనిట్లు పైబడి వాడిన వినియోగదారులకు మాత్రమే స్మార్ట్ మీటర్ల బిగుస్తున్నాం. స్మార్ట్ మీటర్ల వలన ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించు కోవచ్చు. దీనిపై భవిష్యత్తులో రాయితీ ఉండవచ్చు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఎటువంటి అపోహలు లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించుకోవచ్చును.

- చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ, రాయచోటి.

బొప్పాయికి మద్దతు ధర నిర్ణయించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- చిట్వేలు

బొప్పాయికి కనీస మద్దతు ధర రూ.16 వేలుగా నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వారం రోజులుగా జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో జరుగుతున్న బొప్పాయి రైతుల ఆందోళనల నేపథ్యంలో ఆయన శనివారం చిట్వేలి మండలంలో పర్యటించారు. ముందుగా రైతులతో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొప్పాయి పంట దళారీ వ్యవస్థ రైతుల పాలిట పెద్ద గండంగా మారిందన్నారు. ఆ వ్యవస్థ అరికట్టకుండా రైతులకు న్యాయం చేయడం కష్టమని చెప్పారు. బొప్పాయి వ్యాపారంలో మధ్య దళారీ వ్యవస్థను అరికట్టాలని, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. విత్తనాల దగ్గర నుంచి కాయలు కోసి లోడ్ అయ్యే వరకు అడుగడుగునా బొప్పాయి రైతులను దళారీలు మోసం చేస్తున్నారని వివరించారు. నాసిరకం విత్తనాలతో నర్సరీలో మొలకలను పెంచి అమాయక రైతులకు పంపిణీ చేసి పంట సరిగా రాకపోతే బాధ్యత వహించకుండా తప్పించు కుంటున్నారని విమర్శించారు. కోతకొచ్చిన బొప్పా యిలో టన్నుకు నూరు కిలోలు సూటును వసూలు చేసి రైతులను నట్టేట ముంచుతున్నారని చెప్పారు. రైల్వే కోడూరు ప్రాంతంలో జరుగుతున్న బొప్పాయి రైతుల ఆందోళనపై కలెక్టర్ స్పందించడం అభినందనీయమేనని, అయితే రైతులు సంతృప్తి చెందేలా కనీస ధరను నిర్ణయించలేదన్నారు. టన్ను రూ.16 వేల కంటే తక్కువ అయితే బొప్పాయి రైతులు సేద్యపు ఖర్చులు కూడా గిట్టకుండా నష్టపోతారన్నారు. అందుకోసమే బొప్పాయి రైతుల పరిస్థితి ఆలోచించి వారిని కాపాడవలసిన అవసరం ఉందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ మాట్లాడుతూ బొప్పాయి రైతులు ఉద్యమంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకొని మార్వాడి సేట్లు, వ్యాపారులు, రైతులతో చర్చించడం మంచిదైనా వారు నిర్ణయించిన రూ.9 వేలు టన్ను ధరతో రైతులు ఏమాత్రం లాభపడే అవకాశం లేదన్నారు. రైల్వేకోడూరు ప్రాంతంలో బొప్పాయి మార్కెట్ యార్డును ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విత్తనాలను, సబ్సిడీ కింద ప్రభుత్వ సరఫరా చేయాలన్నారు. ఈ నెల ఆరవ తేదీన నుంచి టన్ను ధర రూ.పది వేల కంటే అధికంగా పెంచాలన్నారు. రైతులను నష్టపోకుండా చూడాలన్నారు. ఈ నెల ఆరవ తేదీ నుంచి ధరలు పెంచకపోతే సిఐటియు, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, ఎపిఎండిసి జెఎసి పోరాట కన్వీనర్ ఆర్.వెంకటేష్. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నాగిపోగు పెంచలయ్య, ఎపి రైతు సంఘం చిట్వేలి మండల కన్వీనర్ ఆదినారాయణ, కో-కన్వీనర్లు, శివకృష్ణ, విశ్వనాథరెడ్డి, రత్నం నాయుడు, సుజాతమ్మ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

బకాయిలను వెంటనే చెల్లించాలి

- 12వ పిఆర్‌సిని అమలుచేయాలి
- ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి
- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఫ్యాప్టో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే ఇవ్వాలని ఫ్యాప్టో రాష్ట్రనాయకులు ప్రవీణ్, జిల్లా చైర్మన్ జాబీర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల నిర్వహణ భారాన్ని తొలగించి వారిని కేవలం బోధనకే పరిమితం చేయాలన్న డిమాండ్‌తో ఉపాధ్యాయులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పిఆర్‌సి బకాయిలు, డిఎలు, సరెండర్‌లీవులు తదితర ఆర్థికపరమైన బకాయిలు గత ప్రభుత్వం హయాం నుండి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఏపార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వివిధరకాల పేర్లు, పథకాలతో ప్రభుత్వవిద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి కంకణం కట్టుకున్నాయని చెప్పారు. పి4 కార్యక్రమం నిర్వహణ, హాజరు తదితరాలను ఉపాధ్యాయులకు నిర్బంధంగా అమలు చేయరాదన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి బోధనేతర కార్యక్రమాలను అప్పచెప్పరాదంటూ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ గఫార్‌ఖాన్, జిల్లా చైర్మన్ మధుసూదన్, సిబాతుర్ రహిమాన్, శివారెడ్డి మాట్లాడుతూ ఏకీకృత సర్వీసురూల్స్ సమస్యను పరిష్కరించి విద్యాశాఖలోఉన్న అసంబద్ధతను తొలగించి తక్షణమే 72, 73, 74 జిఒలను అమలు చేయాలంటూ కోరారు. ప్రభుత్వం వెంటనే 12 వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి వెంటనే పాత పింఛను విధానాన్ని అమలులోకి తేవాలని పేర్కొన్నారు. 2024 సెప్టెంబరు 1కి ముందు డుదలైన నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులందరికి కేంద్ర ప్రభుత్వ మెమో 57 జిఒను అమలు చేయడం ద్వారా పాతపెన్షన్ విధానంలోకి తీసుకు రావాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు రెడ్డెన్న మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులందరికి వెంటనే గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలనిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా నేతలు ఇలియాస్, హరిప్రసాద్, జాఫరుద్దీన్, బీలూ నాయక్, రవీంద్రారెడ్డి, రామచంద్ర, నాగమునిరెడ్డి, సుధాకర్ నాయుడు, రవిశంకర్, చంద్రశేఖర్, రెడ్డెప్పరెడ్డి, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి మహేంద్ర అన్నారు. శనివారం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ సెల్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ర్యాగింగ్ అనే హింసాత్మక చర్య విద్యార్థి జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సిఐ వెంకటరమణ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వి.వి.ఎన్.భాస్కర్, యాంటీ ర్యాగింగ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.రోషిని, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వై.అరుణ్ కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - రాయచోటి: ఎస్‌సి, ఎస్‌టి మహిళా నర్సింగ్ అభ్యర్థుల కోసం జర్మనీలో ఉద్యోగ అవకాశం కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉద్యోగకల్పన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి వర్గానికి చెందిన మహిళా నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ, జర్మనీలో ఉద్యోగ అవకాశం కల్పించేలా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, జిఎన్ఎం మూడేళ్లు, బిఎస్‌సి రెండేళ్లు చదివి అనుభవం కల్గిన మహిళా అభ్య ర్థులు మాత్రమే అర్హులన్నారు. 8 నెలల నుంచి 10 నెలలు శిక్షణ కాలం ఉంటుందని, ఆ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు https://naipunyam.ap.gov.in/user-registration-pageRprogram-registrationలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం స్థానిక నమాజ్‌కట్టవీధిలోని ఉర్దూ స్కూల్లో తల్లులకు, గర్భవతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ పిల్లను ఒకలాగా, మగపిల్లవాడిని ఒకలాగా చూడడం వలన ఎన్నో మనస్పర్థలు వస్తాయన్నారు. ఆడ, మగ పిల్లల మధ్య వ్యత్యాసం లేకుండా సమానంగా చూడాలన్నారు. గర్భంలో పెరిగే పిండం యొక్క లింగం ఆడ లేదా మగ అని తెలుసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ అమృత, ఎఎన్ఎం సరోజమ్మ, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: స్థానిక ఇందిరమ్మ కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ డి.హెచ్ చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5వ తరగతిలో 25 సీట్లు, 7వ తరగతిలో 3సీట్లు ఉన్నట్లు తెలిపారు. సీటు కావలసిన విద్యార్థులు ఆదాయ, కుల ధృవపత్రాలు, ఆధార్ కార్డుతో నేరుగా పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు 10 వరకు గడువు

మదనపల్లె అర్బన్ :జవహర్ లాల్ నవోదయ విద్యాలయంలో ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 పదవ తరగతి పాసై ఇంటర్‌లో చేరాలనుకునే అభ్యర్థులు నవోదయ విద్యాలయ వెబ్సైట్, నేరుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు లోపు దరఖాస్తు చేస్తున్న అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి-చిన్నమండెం

రైతుల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 2వ గ్రామ సచివాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ మొదటి విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి అందాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడత కింద1,88,408 మంది రైతులకు రూ.127.89 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందన్నారు. రైతులం దరికీ ప్రతి ఏడాది రూ.20 వేలు జమచేస్తారన్నారు. రైతులు విత్తు చేసే సమయానికి ఉపయోగపడే విధంగా నగదు జమ చేస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం, పెన్షన్, దీపం, అన్నదాత సుఖీభవ పథకాల లబ్ధి చేకూరుతోందని సంబంధిత పథకాల లబ్ధి లబ్ధిదారులు చక్కగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎవరికైతే గతంలో రీ సర్వే జరిగినపుడు జాయింట్‌గా ఎల్‌పిఎం పడియున్నాయో జాయింట్ ఎల్‌పిఎంను విడదీ యడానికి సంబంధించి గతంలో రూ.550 సర్వీస్ ఛార్జీ ఉండేదని, దానిని ప్రభుత్వం రద్దు చేయడం జరిగిందని, ఇప్పుడు దానిని కేవలం రూ.50 చెల్లిస్తే రీ సర్వేలో వాటిని ఎవరి భూమి వారికి విడదీపస్తారని తెలిపారు. భాగపరిష్కారాలు కానివి, కోర్టులో కేసులో ఉన్నవి, అలాంటి మాత్రమే చేయడానికి వీలుపడదని, మిగిలినవన్నీ కూడా తహశల్దార్ ద్వారా, సర్వే టీం ద్వారా పరిష్కారం అవుతాయని తెలిపారు. ఎవరికైతే ఇలాంటి సమస్యలు ఉన్నాయో వారు రూ.50 చెల్లించి సమస్యను పరిష్కరించుకోవచ్చున్నారు. రైతులందరూ ఈ విషయాన్ని గుర్తించుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో దాదాపు 900 మంది రైతుల ఎన్‌పిసి ఇనాక్టివ్‌లో వున్నాయని ఈకేవైసీ కానీ వారు బ్యాంకుకు వెళ్లి వారి ఆధార్ కార్డును అనుసంధానం చేసుకుంటే వారి ఖాతాల్లో కూడా డబ్బులు జమ అవుతాయన్నారు. వలస వెళ్ళిన వారి పేరుమీద భూమి ఉన్నట్లైతే వారు వచ్చినపుడు ఇకెవైసి చేయించుకుంటే వారికి కూడా ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్, ఆర్‌డిఒ శ్రీనివాస్, జెడిఎ శివనారాయణ, తహశీల్దార్ నరసింహులు, ఎంపిడిఒ రామచంద్ర, డిపిఎం వెంకట మోహన్, ఎడిఎ లత, ఎఒ గీత, ఎం.టి.పద్మావతి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్, అధికారులు

ఆర్‌టిసిని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

మాట్లాడుతున్న ఇయు గౌరవాధ్యక్షులు నాగూర్‌వలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమిష్టి కృషితో ఆర్‌టిసిని అభివృద్ధి పథంలో నడిపిద్దామని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అవగాహన కల్పిద్దామని మదనపల్లి-1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్ వలి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో మదనపల్లి-1,2 డిపోల ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు సి.ఎ.బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌టిసి అభివృద్ధిపై ప్రణాళిక రచించారు. బస్టాండ్ ఆవర ణంలో పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం, అధునాతన మరుగుదొడ్ల నిర్మాణం, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక విశ్రాంతి గదులు, ఉద్యోగులకు టాయిలెట్స్ నిర్మాణం, ప్లాస్టిక్ రహిత బస్టాండుకు కృషి, అక్రమ బదిలీల రద్దు తదితర అంశాలపై చర్చించి తీర్మానించారు. నాగూర్ వలి మాట్లాడుతూ డిపోలలో నెలకొన్న సమస్యలను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. డిపోలలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. రెండు డిపోల పరిధిలో ఖాళీగా ఉన్న డ్రైవర్ల ఉద్యోగాలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి రెండేళ్ళ అనుభవంతో పాటు ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిపో మేనేజర్లను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో రీజినల్ కమిటీ నాయకులు కె.ప్రకాష్, వి.ఎస్.అలీ, రెండు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు మధు, ఎస్.కె హుస్సేన్, గ్యారేజీ సెక్రెటరీ హెచ్.హుసేన్, ముఖ్య నాయకులు పి.హరిబాబు, ఎం.సి.శేఖర్, సూరిబాబు, మహిళా నాయకులు అలియ, శారదమ్మ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎస్‌టి కాంపోనెంటును వినియోగించుకొని గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన జిల్లాస్థాయి షెడ్యూల్ ట్రైబ్ కాంపోనెంట్ (ఎస్టీ సబ్ ప్లాన్) కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌టి సంక్షేమశాఖ అధికారి తేజస్విని, అన్నమయ్య జిల్లాకు సంబంధించి హౌసింగ్ పంచాయతీరాజ్ తదితర శాఖలకు కేటాయించిన బడ్జెట్‌పై కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బడ్జెట్లో 5.53 శాతం ఎస్‌టి కాంపోనెంట్ కింద కేటాయించిందని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి ఇదే శాతంలో కేటాయించారని చెప్పారు. ఎస్‌టి కాంపోనెంట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన బడ్జెట్‌ను వినియోగించుకొని గిరిజనుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌టి సబ్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్

హార్సిలీహిల్స్‌లో లాడ్జిలో రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి మహేంద్ర

హార్సిలీహిల్స్‌లో ముమ్మర తనిఖీలు

- నిబంధనలు పాటించకపోతే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ కొండపైన మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర ఆధ్వర్యంలో శనివారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు.ఇద్దరు సిఐలు, ఐదుగురు, 50 మంది పోలీస్ సిబ్బందితో హార్సిలీహిల్స్ కొండపైన ఉన్నటువంటి హోటళ్లు, లాడ్జిలు, రిసార్ట్‌లు ఆకస్మిక తనిఖీ చేసి వాటి యజమానులకు రూ ములు అద్దెకు ఇచ్చే సమయంలో వారి నుండి తగిన గుర్తింపు పత్రాలు తీసుకొని ఇవ్వాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదని తెలిపారు. కొండపైన ఉన్న వ్యూ పాయింట్ వద్ద జాగ్రత్తగా ఉండాలని, ఒపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, కొండపైకి వచ్చు మోటార్ సైకిల్ వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనతనిఖీ చేస్తూ హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. సరైన పత్రాలు లేని 14 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించి, పర్యాటకులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి హెచ్చరించారు.హోటళ్లు, లాడ్జి నిర్వాహకులు పర్యాటకుల ఆదేశాలను పాటించాలని సూచించారు.

వంద శాతం హాజరయ్యే విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పాఠశాలకు 100 శాతం హాజరవుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన నిమ్మనపల్లిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు జూలై నెలలో 100 శాతం హాజరైన 20 మంది విద్యార్థులకు ప్రోత్సాహకంగా పెన్నులు బహుమతిగా అందించినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, విద్యార్థులను దగ్గరగా గమనిస్తూ వారిలోని సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోపాటు, వారికి ప్రతిరోజు ఒక ప్రయోగాత్మక కార్యక్రమాలను నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, గుర్రప్ప, భాస్కర, సుధాకర, సి.ఆర్.పి స్వాతి పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శిగా ఈశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శిగా మండలానికి చెందిన ఆర్.సి. ఈశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. శనివారం పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పదవితో తన బాధ్యత మరింత పెరిగిందని, ఇప్పటి నుంచి నిర్విరామంగా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని వెల్లడించారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ మాజీ మంత్రి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

భర్త సహకారంతోనే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా

ప్రజాశక్తి-పుల్లంపేట

శిరీష

మండల పరిధిలోని వత్తలూరు గ్రామానికి చెందిన కాలి శిరీష మురిరాజ్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త సహాయ సహకారాలు అండ తోనే తాను కానిస్టేబుల్‌గా ఎంపిక అయ్యాయని అన్నారు. తన భర్త డొంక చిన్నయ్య ఓబులవారిపల్లి మండలం గోబ్బూరు వారిపల్లి సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారని తెలిపింది. నా తదుపరి లక్ష్యం ఎస్ఐని కావడమేనని తెలిపారు.

అనుకున్న లక్ష్యం నెరవేరింది

అశ్విని

రామాపురం : పోలీసు ఉద్యోగం చేయాలన్న తన లక్ష్యం నెరవేరిందని మండలం లోని గోపగుడిపల్లె, కస్పాకు చెందిన కావలి అశ్విని పేర్కొన్నారు.134 మార్కులు సాధించి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక అయ్యాయని తెలిపింది. తన పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. పోలీసు ఉద్యోగానికి అశ్విని ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తల్లిపాల గదిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : శిశువులకు పాలిచ్చే తల్లులు ఏకాంత తల్లిపాల గదిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ జి.రమణయ్య, సిడిపిఒ సునంద కోరారు. శనివారం ఆర్టిసి బస్టాండ్‌లో శిశువులకు తల్లి ఏకాంతంగా పాలిచ్చేందుకు గానూ ఒక ఏకాంత గదిని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ కలెక్టర్, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ గదిని ప్రారంభించడం జరిగిందని, ఈ అవకాశాన్ని తల్లులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిర్మల, సుబ్బలక్షమ్మ పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాక్సర్ జగదీష్‌కు సన్మానం

ప్రజాశక్తి - నందలూరు : అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన నందలూరు విఆర్ఒ మండ్ల జగదీష్‌ను తహశీల్దార్ అమరేశ్వరి, సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె గ్రామా నికి చెందిన జగదీష్ గత నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన ఇన్విటేషన్ బాక్సింగ్ ఛాంపి యన్‌షిప్-2025 పోటీలలో 72 నుంచి 75 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ సంద ర్భంగా జగదీష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీలలో పాల్గొని విజయం సాధించి దేశ కీర్తి ప్రతిష్టతలను పెంపొం దిస్తానని అన్నారు. కార్యక్రమంలో డిటి మోహన్, ఆర్ఐ సుశీల్, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-సుండుపల్లి : మండలంలోని రాయవరం గ్రామపంచాయతీలో రాయవరం జడ్‌పిహైస్కూల్ విద్యార్థులకు చట్టాలపైన అవగాహన కల్పించినట్టు ఎంఇఒ రవినాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లా డుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అలాంటివి ఎక్కడైన జరిగితే వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలని అన్నారు. చిన్నపిల్లల చేత పనులు చేపించినా నేరమని ఎవరైన పిల్లలచేత పనులు చేయిస్తే అంగన్వాడీ సూపర్‌వైజర్ దృష్టికి తీసుకపోవాలన్నారు. చట్టాలపై ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ రవినాయక్

హామీలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం : 'నల్లారి'

రాజంపేటం : రైతులకు చెక్కును అందిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-కలికిరి

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధుల చెక్కను రైతులుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలలో భాగం గా రైతుల కొరకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం కింద నియోజకవర్గంలో 38వేల మంది రైతులకు రూ.27 వేల కోట్లుతో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధులు మొదట విడత నగదు తమ ఖాతాలో జమ అవుతాయని, కౌలు రైతులు కు కూడా అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని తెలిపారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సహకార బ్యాంకు చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి, స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, అగ్రికల్చర్ ఎడి రమణారావు, డిప్యూటీ ఎంపిడిఒ, హార్టికల్చర్ ప్రిన్సిపల్, ఎఒ హేమలత పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ మొదటి విడత నగదును లబ్ధిదారుల ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 24,622 మంది రైతులుకు రూ.17.24 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.నాగేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మెన్ పి.వరలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ రవికుమార్‌రాజు, ప్రకాష్‌వర్మ, మాజీ ఎంపిపి వెంకటేశ్వర్‌రాజు, కోడూరు సర్పంచ్ శివయ్య, మండల ప్రత్యేక అధికారి మస్తాన్‌బాషా, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ మణి, తహశీల్దార్ అమర్‌నాథ్, ఎంపిడిఒ నాగార్జునరావు, రైతులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:** అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం ద్వారా మండలంలోని 5479 మంది రైతులు లబ్ధి పొందినట్లు మండల వ్యవసాయ అధికారిని మంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 5479 మంది రైతులకు మొదట విడతగా రూ.3.83 కోట్లు నిధులను విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. సంవత్సరానికి మూడు విడతల్లో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు అందిస్తుందన్నారు. దీనితో రైతులు తమ వ్యవసాయ అవసరాలకు ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **సుండుపల్లి:** మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో రెడ్డివారిపల్లె సచివాలయంలో శనివారం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రైతులకు నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని టివిల ద్వారా రైతులకు చూపించారు. కార్యక్రమంలో రెడ్డివారిపల్లె సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్ నాయక్, వెలుగు సిసి ఓబులేసు, రైతులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ యోజన పథకం కింద నియోజకవర్గంలోని 20,162 మంది రైతులకు రూ.14.11కోట్లు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూ పేర్కొన్నారు. సి ఎస్ఐ జెసిఎం ఫంక్షన్ హాల్లో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ యోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు గురుమూర్తిగౌడ్, టమోటా మార్కెట్ చైర్మన్ జంగాల శివరాం, రమణ పాల్గొన్నారు.**రాజంపేట అర్బన్ :** అన్నదాత సుఖీభవ పథకంతో వ్యవసాయానికి సాయం అందుతుందని, రైతును రాజు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళ్లపాక గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని 22,288 మంది రైతులకు రూ.20.11 కోట్లు చెక్కును అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ కార్పొరేషన్ చైర్మన్ కెకె చౌదరి, రాజంపేట పరిశీలకులు భీమిలినేని చిట్టిబాబు, తహశీల్దార్ పీర్ మున్నీ, వ్యవసాయ శాఖ అధికారులు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్, టిడిపి సీనియర్ నాయకులు శరత్ కుమార్‌రాజు పాల్గొన్నారు.

నేడు జికె నేచర్ వ్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె

పుంగనూరు-మదనపల్లె జాతీయ రహదారి పక్కన 42 ఎకరాల్లో జికె నేచర్ వ్యాలీ వెంచర్‌ను ఆదివారం ప్రారంబిస్తున్నట్లు నిర్వాహకులు టి. కృష్ణప్పనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ వెంచర్‌లో 500 ప్లాట్లతో రూపొందిన ఈ ప్రాజెక్ట్‌లో అధునాతన వసతులు కల్పించడం జరిగింగన్నారు.ఈ వెంచర్‌లో 50 అడుగుల రహదారులు, కాంక్రీట్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, విద్యుత్ లైట్లు, పిల్లల పార్కులు, కమ్యూనిటీ హాల్, టెన్నిస్ కోర్ట్, క్లబ్ హౌస్, కల్యాణమండపం, గెస్ట్ హౌస్, స్పోర్ట్స్ హబ్, జిమ్, యోగా హాల్, లైబ్రరీ, ఆడిటోరియం వంటివి ఏర్పాటు చేయనున్నామన్నారు.ఈ వెంచర్ స్థలంలో ఇప్పటికే పలు సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని,అడ్వెంచర్ జోన్, సైక్లింగ్ ట్రాక్, అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణం, మినీ జూ వంటి ఆకర్షణలు ప్రత్యేకతలు కలవన్నారు. వెంచర్ చుట్టూ పచ్చదనం విద్యుత్, మంచినీటి సౌకర్యాలు అందిస్తున్నామని చెప్పారు.

మాట్లాడుతున్న టి.కృష్ణప్పనాయుడు

వెంచర్

అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

ఆదర్శంగా అంగన్వాడీ కేంద్రాలు :ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం గంగాపురంపల్లెలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార పదార్థాలను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. చిన్నారులు,గర్భిణులు, బాలింతల్లో పౌష్టిక ఆహార లోపాన్ని అధిగమించడానికి ప్రభు త్వం పాలు, గ్రుడ్లు, బాలామృతం అందిస్తోందని అన్నారు. గర్భిణులు పోషకాహారమైన ఆకుకూరలు, కూర గాయలు, పాలు క్రమం తప్పకుండా తీసుకుంటూ రక్తహీనతలను అధిగమించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. బలమైన పోషకాహారాన్ని చిన్నారులకు అందించడం ద్వారా వారు ఆరోగ్యంగా ఉంటూ మంచి ఎదుగుదలను సాధించగలరని వివరించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో ఆరోగ్య స్థితిగతులను పరీక్షించాలన్నారు. బలహీనంగా ఉన్న వారికి తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పర్వీన్ పాల్గొన్నారు.

పీలేరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం

ప్రజాశక్తి-రామాపురం

అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు అమృతంలో సమానం అని మాతా శిశు సంక్షేమ శాఖ లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్ట్‌అధికారి జహీరాభి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు సెక్టార్ పక్కిరపల్లె అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ శిశువు జన్మదిన గంటలోపు తల్లి నుంచి ముర్రుపాలు పట్టించడం వల్ల శిశువు వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సుజాత , అరుణ కుమారి, ఎఎన్ఎం ఉమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు వి.శైలజ, ఉషారాణి, ప్రభావతి, నాగేశ్వరి, నిర్మలజ్యోతి పాల్గొన్నారు.తప్పనిసరిగా ఆరు నెలల పాటు శిశువుకు పాలను ఇవ్వాలన్నారు. **పీలేరు:** శిశువు పుట్టిన గంటలోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు అంటువ్యాధులు రాకుండా రక్షించే తొలి టీకా లాంటిదని, వీటి ప్రాముఖ్యత గురించి ప్రతి గర్భిణి అవగాహన కలిగి ఉండాలని తలుపుల ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం తలుపుల అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింత లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో డాక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక పోషకాలతో నిండిన ముర్రుపాలు, వ్యాధి నిరోదక శక్తిని, చురుకైన మెదస్సును, పెంచడమే కాకుండా న్యుమోనియా, డయేరియా లాంటి అంటువ్యాధులను నిర్మూలిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, సూపర్‌వైజర్ ఉమ, ఎఎన్ఎం ఫామున్నిసా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానశాఖ అధికారి సింధూరి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-గాలివీడు

యాజమాన్య పద్ధతులతో మామిడిలో మంచి దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి సింధూరి పేర్కొన్నారు. కాయలు కోసినప్పటి నుంచే తోటల్లో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శనివారం సీమలచెరువు పంచాయితీ యర్రదొడ్డిగారిపల్లెలో రైతులను కలిసి మామిడి తోటలు పరిశీలించి కాయల కోత తర్వాత మామిడిలో ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. సంవత్సరంలో కేవలం ఒక్కసారి మాత్రమే పంటనిచ్చే మామిడిలో మంచి దిగుబడులు పొందాలంటే కాయలు కోసినప్పటి నుంచే తోటల్లో తగు జాగ్రత్తలు పాటించా లన్నారు. ఇందులో చెట్ల ఆకారం నిర్వహణ, తల మార్పిడి, పునరుద్ధరణ చర్యలు ముఖ్యమైనవని అన్నారు. ముదురు తోటల్లో కొమ్మలు బాగా పెరిగి కలిసి పోవడం వల్ల సూర్యరశ్మి సోకక చీడపీడల బెడద పెరిగి సస్యరక్షణ చర్యలు కష్టం కావడంతోపాటు దిగుబడులు నాణ్యత తగ్గుతుందని అన్నారు. కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజు లు చెట్టుకు విశ్రాంతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విహెచ్ఎ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పున:ప్రతిష్టాపన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి : మండలంలోని తవళం గ్రామంలో శ్రీ నేలమల్లేశ్వరస్వామి దేవస్థానంలో పునఃప్రతిష్టాపన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమైనట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. మొదటి రోజు శనివారం ఉదయం గం.8లకు మహాగణపతి పూజ, గోపూజ మాతృకా పూజ, పంచగవ్య ప్రాసనం, అంకురార్పణ, దీక్షా కంకణధారణ, ప్రధాన కలశస్థాపన, మహా మంగళహారతి, సాయంత్రం ప్రదోష పూజ, మూల మంత్రం జపం, అగ్ని ప్రతిష్ట దీక్షాహోమం, గణపతి హెూమం, జల క్షీరాధివాసం, తీర్థ ప్రసాద వినియోగం మొదలగు కార్యక్రమాలు యాగ్నికులు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు గుత్తా హరికృష్ణ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాత్కాలిక ఆలయ కమిటీ చైర్మన్ మేష రామకృష్ణ, సర్పంచు రెడ్డప్ప, బి.రాజన్న, గుత్తా హరికృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్ పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ

- డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్

ప్రజాశక్తి -చిన్నమండెం : రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తామని ఉమ్మడి కడప జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని సహకార బ్యాంకును ఆయన సందర్శించారు. సింగిల్ విండో అధ్యక్షుడు కోప్పూరి శివయ్యనాయుడు డిసిఎంఎస్ అధ్యక్షుడిని సన్మానిం చారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ రాబోయే కాలంలో రైతు లకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి వీరభద్ర స్వామి మాట్లాడుతూ రైతులకు రుణాలు ఇస్తున్నామని, రుణాలు కావలసినవారు 1బి అడంగల్ తీసుకొస్తే రైతులకు రుణాలు ఇప్పిస్తామని తెలిపారు.



జయప్రకాష్‌ను సన్మానిస్తున్న శివయ్యనాయుడు

మత్స్యకారులతో మాట్లాడుతున్న టాస్క్ ఫోర్స్ అధికారులు

అక్రమంగా చేపలు పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నందలూరు

జిల్లాలోని సోమశిల వెనక జలాలలో చేపలను అక్రమ పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని మత్స్య శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం సోమశిల వెనుక జలాల్లో చేపల అక్రమ వేటపై టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల ఒకటి నుంచి మత్స్య శాఖ అధికారులు వేట చెయ్యనివ్వకుండా నిషేధించినప్పటికీ కొందరు సాగిస్తున్నారని అన్నారు. కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదులు అంద డంతో స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయమని టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనిఖీలలో భాగంగా మత్స్య కారులలకు ఈనెల 31వరకు చేపల వేట చేయరాదని అక్కడ అన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి ప్రసాద్‌నాయక్, కానిస్టేబుల్ చెన్నయ్య పాల్గొన్నారు.

విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

పాఠశాలల్లోకి మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులను తప్ప మరెవ్వరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఈ నిర్ణయం ప్రజాస్వామ్య హక్కులను హరించే విధంగా ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ అన్నారు. శనివారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు బయటికి రాకుండా విద్యార్థుల నోరునొక్కే ప్రయత్నమే ఇదని తెలిపారు. కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారాన్ని, అక్కడ జరిగే అనేక అన్యాయాలను విద్యార్థి సంఘాలు మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ఘటనలు చాలా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి ఉత్తర్వుల ద్వారా ఇక నుండి కార్పొరేట్, ప్రయివేట్ విద్యా వ్యాపారం, అక్కడ జరిగే అన్యాయాలను బయటికి తీసే అవకాశం లేకుండా పోతుందని, ఈ ఉత్తర్వులు ప్రజాస్వామ్య స్వేచ్ఛను హరించే విధంగా ఉందని చెప్పారు. పాఠశాలల్లో ప్రజాస్వామ్య హక్కులు ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే విద్యార్థి సంఘాల ఉనికిని దెబ్బ తీసే విధంగా ఈ ఉత్తర్వులు ఉన్నాయని ఆరోపించారు. ఇలాంటి ఆంక్షలు విధించడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ,పాఠశాల విద్యాశాఖ వెంటనే స్పందించి ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యార్థి, యువజన సంఘాలు సంయుక్తంగా పోరాటాల నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

క్రైం కార్నర్

లారీ, ఆటో ఢీ : మహిళ మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు

- మానవత్వం చాటుకున్న ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని బోయినపల్లి సమీపంలో శనివారం లారీ, ఆటో ఢీ కొన్న సంఘటనలో పట్టణంలోని రాంనగర్‌లో నివాసమున్న నాగారం లక్ష్మీదేవి (46) మహిళ మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నందలూరులో సౌమ్యనాథ స్వామిని దర్శించుకుని రాజంపేటకు వస్తున్న ఆటోను, తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రాంనగర్ కు చెందిన దివ్య, ఓబులవారిపల్లికి చెందిన తోట గగన్, మౌనిక, వెంకటరమణ, శేషమాంబాపురంకు చెందిన సాంబయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళుతున్న ఎఎస్‌పి మనోజ్ రామ్నాథ్‌హెగ్డే ప్రమాద సంఘటన గమనించి గాయపడ్డ వారిని ఆయన వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ద్విచక్ర వాహనం ఢీకొనడంతో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం పుంగనూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు మండలంలోని భీమగానిపల్లెకు చెందిన విద్యార్థి రామచరణ్ స్కూల్ వదలగానే మధ్యాహ్నం భోజనానికి వెళ్లేందుకు మోతుకుపల్లె కట్ట వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ద్విచక్ర వాహనం రామ్‌చరణ్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితున్ని కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొలెరో ఢీకొని మరో వ్యక్తికి..

మదనపల్లె అర్బన్ :బోలేరో ఢీకొని స్కూటరిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కలకడ మండలం గుడిబండకు చెందిన మురళి గత కొన్నేళ్లుగా మదనపల్లె మండలం, వైయస్సార్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సొంత పనిపై ద్విచక్ర వాహనంలో స్వగ్రామం గుడిబండకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని ముదివేడు సమీపంలోని అడవిలోపల్లి వద్ద వెనుకనుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని గుర్తించిన స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఆసుపత్రికి చేరుకున్న బాధితుని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు రెఫర్ చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఆసుపత్రి ఉన్నప్పటికీ ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఇక్కడే చికిత్స అందించాల్సింది పోయి రెఫర్ చేయడమేంటని ప్రశ్నించారు. వైద్యులు బాధితునికి అవసరమైన వైద్య చికిత్స పరికరాలు ఇక్కడ అందుబాటులో లేవని దీంతో ఏదైనా ప్రమాదం వస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని నచ్చ జెప్పారు.

హమాలీపై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె టమోటా మార్కెట్ యార్డ్‌లో పనిచేసే హమాలీపై మందుబాబులు దాడి తీవ్రంగా గాయపర్చారు. బాధితుని కథం మేరకు..టమోట మార్కెట్ యార్డులోని ఎబి టమోటా మండిలో పట్టణానికి చెందిన భావజాన్ హమాలీగా పని చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం సేవించి ఆ మత్తులో దారి విషయమై బావాజాన్‌తో గొడవపడి, బండరాళ్లతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో గాయపడిన బాధితున్ని స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రాతికుంటపల్లి పంచాయతీ ఎగువబట్ట వాండ్లపల్లెకు సమీపంలో కట్టెల లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి క్రింద పడింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ల ప్రయాణిస్తున్న మండలంలోని దేవులపల్లి పంచాయతీ దిగువ దళితవాడకు చెందిన వెంకటరత్నం (35) మృతి చెందినట్లు తెలిపారు.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ల ప్రయాణిస్తున్న గుర్రంకొండ మండలం మరి మేకల పల్లెకు చెందిన నరసింహులు అనే వ్యక్తికి కాళ్లు విరగడంతో 108 వాహనంలో పీలేరు తరలించినట్లు తెలిపారు. ఎస్ఐ రామాంజనేయులు సంఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.